అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 28 ఫిబ్రవరి 2023

1,15,29 తేదీల్లో సదరం క్యాంప్

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చి నెలలో 1,15,29 తేదీల్లో సదరం క్యాంప్ నిర్వహించనున్నట్టు డీఆర్‌డీఏ అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరం క్యాంప్‌నకు హాజరయ్యే వికలాంగులు మీ సేవ వద్ద సదరం క్యాంప్ స్లాట్ బుకింగ్ నేటి (మంగళవారం) మధ్యాహ్నం గంట నుంచి చేసుకోవచ్చని, రసీదులో సూచించిన ప్రాంతంలో ఆ తేదీ రోజు హాజరుకావాలని సూచించారు. క్యాంప్‌నకు వచ్చే వారు ఖచ్చితంగా మాస్క్ ధరించి భౌతిక దూరం పాటించాలని, లబ్దిదారుడితో పాటు ఒకరికే ప్రవేశం ఉంటుందని, హాజరయ్యే ముందు సంబంధిత మెడికల్ రిపోర్టులు తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా సదరం సర్టిఫికేట్ గడువు ముగిసిన లబ్దిదారులు త్వరగా రెన్యూవల్ చేసుకోవాలని, లేకుంటే ఆసరా పెన్షన్ నిలిచిపోతుందని తెలిపారు.

టీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి


టీయూ వీసీకి సన్మానం

టీయూలో తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ దాచేపల్లి రవీందర్ గుప్తా హాజరయ్యారు. టీయూ అభివృద్ధిలో కాంట్రాక్ట్ అధ్యాపకుల కు రానున్న కాలంలో మరిన్ని బాధ్యతలను అప్పగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపక సంఘ ప్రతినిధి డాక్టర్ నారాయణ మాట్లాడుతూ యూనివర్సిటీ లోని తమ సమస్యలను విన్నవించారు.

ధరల పెరుగుదలతో ప్రజలపై ఆర్థిక భారాలు

- కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులను పెంచి ప్రజలను ఆదుకోవాలి
- సీపీఐ(ఎం) డిమాండ్.. కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతో సాధారణ, మధ్య తరగతి ప్రజలపైన విపరీతమైన భారాలు పడుతుండటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమస్యల పరిష్కారంపై ఏమాత్రం శ్రద్ధ చూపిన పరిస్థితి లేదు. ఒకవైపు నిరుద్యోగం, పేదరికం, దారిద్రం పెరిగిపోవడంతో పాటు ప్రజల పైన విపరీతమైన ఆర్థిక భారాలు పడే విధంగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రజా సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని' సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ప్రజలు, నాయకులు నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరించటం మూలంగా ఉన్న ఉపాధి అవకాశాలు తగ్గిపోవటంతో పాటు సాధారణ మధ్యతరగతి ప్రజలకు విద్య, వైద్యం, అత్యంత ఖరీదుగా మారుతున్నాయని అన్నారు. వీటికి తోడు పేద ప్రజలకు ఇచ్చే సబ్సిడీలు సంక్షేమ పథకాలకు కోత విధించి పెట్టుబడిదారులకు ధనవంతులకు ప్రజా సంపదను కట్టబెట్టడం మూలంగా ధనిక పేద వ్యత్యాసాలు విపరీతంగా పెరుగుతున్నాయని చెప్పారు. వీటిని నివారించే చర్యలు చేపట్టాలని, నిరుద్యోగం, పేదరికం తగ్గించటానికి బడ్జెట్లో నిధులను పెంచాలని డిమాండ్ చేశారు.

ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాలను తగ్గించటానికి ధరలను అదుపు చేయటానికి చర్యలు చేపట్టాలని, ఉపాధి హామీని పట్టణాలకు కూడా విస్తరించి నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, పేదలకు అందుబాటులో ఉండటానికి ప్రభుత్వమే సరిపడా విద్య వైద్యాలయాలు నిర్వహించాలి, ప్రైవేట్ వాటిపైన నియంత్రణ ఉంచాలని, పెట్టుబడిదారులకు ఇచ్చే రాయితీలను తొలగించి పన్నులను విధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దవెంకట్‌రాములు, సబ్బని లత, పల్లపు వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, వై గంగాధర్, జై గంగాధర్, అనిల్, నగర కమిటీ సభ్యులు కే రాములు, నరసయ్య కృష్ణ, అఫ్సర్ ఖాన్, లక్ష్మీ, తదితరులతోపాటు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన నాయకులు, పేదలు

జీవో 58 ప్రకారం.. గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్
- వ్యకాస ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

2014లో ప్రభుత్వం తీసుకొచ్చిన 58 జీవోను జిల్లాలో అమలు చేసి అర్హులైన పేద ప్రజలందరికీ 125 గజాల చొప్పున ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 58 జీవో ప్రకారం ఎటువంటి ఆంక్షలు లేని ప్రభుత్వ భూమిలో భూమిని ఆక్రమించుకొని నివాసముంటున్న పేద ప్రజలకు గుడిసె వాసులకు పట్టా సర్టిఫికెట్లు ఇచ్చి సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఈ జీవోను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జంగంపల్లి గ్రామంలో పేద ప్రజలు గత ఎనిమిది నెలలుగా ప్రభుత్వ భూమిలో నివాసపు గుడిసెలు వేసుకుని తమ నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆ గ్రామంలోని కొందరు నాయకులు ఆ ఉద్యమంపై తప్పుడు దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. వాటిని మానుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, చంద్రకళ, శ్యామల, కవిత, వెంకటలక్ష్మి, బాలరాజ్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కనిపించడంలేదా..?

- మల్యాద్రికి పోచారం భాస్కర్‌రెడ్డి ప్రశ్న


మాట్లాడుతున్న పోచారం భాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి మల్యాద్రి రెడ్డికి కనిపించడం లేదా... అని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. స్పీకర్‌పై అర్థంలేని ఆరోపణలు చేస్తే నియోజకవర్గ ప్రజలే తరిమికొడతారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేశారు. మండల కేంద్రంలోని సుభాశ్‌చంద్రబోస్ చౌరస్తా వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పోచారం భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి.. వారికి కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఇరువురూ మాట్లాడారు. బీజేపీ మతతత్వ పార్టీ అని, 30 ఏండ్లుగా మత కల్లోలాలు లేని నియోజకవర్గంగా బాన్సువాడ ఉందని, ఇక్కడ కలహాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని అన్నారు. సొంత బావను మల్యాద్రి హత్య చేశాడని ఆరోపించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కనిపించిందా లేదా..? అని సూటిగా ప్రశ్నించారు. 11 వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇచ్చినట్టు తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

- గిద్దలో కార్డన్ సర్చ్.. 80 బైక్‌లు సీజ్

నవతెలంగాణ-రామారెడ్డి


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

మండలంలోని గిద్ద గ్రామంలో సోమవారం డి.ఎస్.పి సురేష్ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామంలో 150 ఇండ్లను తనిఖీ చేయగా, 80 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని, విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణపత్రాలు కలిగి ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, మహిళల భద్రతపై, సైబర్ క్రైమ్, తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్ రెడ్డి, ఎంపీటీసీ ప్రవీణ్ గౌడ్, ఎస్సై అనిల్, ఆయా పోలీస్ స్టేషన్లో నుండి వచ్చిన పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రీతికి నివాళి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ర్యాగింగ్‌తో ఆత్మహత్యాయత్నం చేసుకొని ఐదురోజులుగా చికిత్స పొంది మృతిచెందిన వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ వైద్యవిద్యార్థిని ప్రీతి మృతి చెందడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పలువురు నివాళి అర్పించారు. విద్యార్థి సంఘాలతో పాటు గిరిజన, రాజకీయ నాయకులు నివాళి అర్పించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళి అర్పించారు.


ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి


స్వామి(ఫైల్ ఫొటో)

అప్పుల బాధ తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురై రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన డిచ్‌పల్లి పోలీస్ సేట్షన్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కచ్చుకాయల గణేశ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లారం స్వామి (48) రెండు ఎకరాల భూమిలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కాలుకు గాయం అవడంతో చికిత్స కోసం దాదాపు రూ.8 లక్షల ఖర్చు అయింది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. అప్పులకు మిత్తీలు కట్టలేక.. కుటుంబ పోషణకు డబ్బులు లేక ఆర్థికంగా చితికిపోయాడు. దీంతో తనకున్న రెండు ఎకరాల భూమిలో ఎకరన్నర భూమిని విక్రయించగా.. వచ్చిన డబ్బులతో కొంత మేర అప్పులు చెల్లించాడు. ఇంకా అప్పులు ఉండటంతో అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలో ఉండగా.. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతుని భార్య బొల్లారం లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి హామీలో అక్రమాలు

- పనులు చేయకున్నా.. చేసినట్టు చెల్లింపులు
- అక్రమార్కులపై క్రిమినల్ కేసులు
- ప్రజావేదికలో డీఆర్‌డీఏ పీడీ సాయన్న

నవతెలంగాణ-లింగంపేట్



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న సాయన్న

జాతీయ గ్రామీణ ఉపాధి చట్టంలో అవినీతి అక్రమాలు జరుగుతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డిఆర్‌డిఏ పిడి సాయన్న అన్నారు. సోమవారం లింగంపేట్ మండల పరిషత్ కార్యాలయం ముందు 13 విడత సామాజిక తనిఖీ సోషల్ ఆడిట్ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 2019 నుంచి 2022 వరకు మండలంలో ఆయా గ్రామ పంచాయతీలు 25 కోట్ల 63 లక్షలు రూపాయలతో పనులు చేపట్టినట్టు తెలిపారు. 41 గ్రామపంచాయతీలో ఆడిట్ నిర్వహించగా.. పలు చోట్ల అవకతవకలు, అక్రమాలాలకు పాల్పడినట్టు తేలిందని తెలిపారు. పనులు చేయకుండా పనిచేసినట్లు కూలీల డబ్బులు కాజేశారన్నారు. సంబంధిత మెట్లు కార్యదర్శిలపై రికవరీతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

రాంపల్లి తాండాలో పనిచేసే మస్టార్లను తగలబెట్టిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగిన తనిఖీల్లో.. పంచాయ తీల వారీగా నివేదికలు వినిపించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ కల్పన, ఫైనాన్స్ మేనేజర్ రామనారాయణ, స్టేట్ రిసోర్స్ పర్సన్ కొమరయ్య, మానిటర్ నరేందర్, ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి, ఏపీవో తులసిరామ్ పాల్గొన్నారు.

మార్చ్‌లో డిపాజిటర్‌ల డబ్బులు చెల్లిస్తాం

- తాళ్లరాంపూర్ పీఏసీఎస్‌లో మహాజన సభలో జిల్లా సహకార అధికారి వెల్లడి

నవతెలంగాణ-ఏర్గట్ల

మార్చి చివరి వారంలో డిపాజిటర్ల డబ్బులు చెల్లిస్తామని జిల్లా సహకార అధికారి సింహాచలం తెలిపారు. మండలంలోని తాళ్లరాంపూర్ పీఏసీఎస్‌లో డిపాజిటర్లతో సంఘ అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మహాజన సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా సహకార అధికారి సింహాచలం హాజరై మాట్లాడారు. సంఘానికి సంబంధించిన ఆస్తులు రైస్ మిల్ 2 కోట్ల 5 లక్షలు, గుమ్మిర్యాల్ క్యాష్ కౌంటర్ 61 లక్షలు, తాళ్ల రాంపూర్ ఓపెన్ ల్యాండ్ కోటీ లక్ష 50 వేలకు విక్రయించినట్టు తెలిపారు. ఫంక్షన్ హాల్ విక్రయించేది ఉందని, మార్చి చివరి వారంలోగా డిపాజిటర్ల డబ్బులు మొత్తం చెల్లిస్తామని తెలిపారు. అనంతరం వివిధ తీర్మానాలను గురించి చర్చించారు. అందులో మొదటగా డిపాజిటర్లకు ఆర్బీఐ నిబంధనల ప్రకారం 6.10 శాతం వడ్డీ చెల్లించాలని తీర్మానించారు. ఆస్తులు అమ్మగా వచ్చిన రూపాయలను మొదటగా ఎన్సీడీసీకి చెల్లించాలని అన్నారు. ఫంక్షన్ హాల్‌ను ఎవరైనా డిపాజిటర్లు కొనడానికి ముందుకు వస్తే వారి డిపాజిట్ పైసలతోనే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు. మాజీ చైర్మన్ సోమ చిన్న గంగారెడ్డి, మాజీ కార్యదర్శి స్వామిల కోర్టు కేసు విషయంలో సంఘం తరపున కోర్టులో ఇంప్లీడ్ పిటీషన్ వేయాలని తీర్మానించామన్నారు. తాళ్ళ రాంపూర్‌లో ఓపెన్ ల్యాండ్ అమ్మడం వల్ల, వడ్ల సెంటర్ కోసం తాత్కాలికంగా భూమిని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సమావేశం అనంతరం కొందరు డిపాజిటర్లు మాట్లాడుతూ... మూడు సంవత్సరాల కాలం నుండి డబ్బులు ఇస్తామని ఆలస్యం చేస్తున్నారని, గత 15 రోజుల కింద ఫిబ్రవరి చివరలో డబ్బులు చెల్లిస్తామని జిల్లా సహకార అధికారి సింహాచలం తెలిపారని. తీరా చూస్తే మరో నెల వాయిదా వేసి మార్చి చివరి వారంలో డబ్బులు చెల్లిస్తాం అనడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా చేస్తే ఆందోళన చేయడం ఖాయమని అన్నారు. మహాజన సభలో ఏఓ అబ్దుల్ మాలిక్, సంఘ వైస్ చైర్మన్ జి.కె గంగారెడ్డి, సభ్యులు ఆడేం గంగాప్రసాద్, సోమ దేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మహాజనసభలో మాట్లాడుతున్న సింహాచలం

మిగిలిన శనగలు ఎవరికి అమ్మాలి..?

ఎకరానికి ఆరు క్వింటాళ్లే కొంటామనే కొర్రీపై రైతులు ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నవతెలంగాణ-కోటగిరి

ఎకరానికి ఆరు క్వింటాళ్ల శనగలే కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన పంటను ఎవరికి విక్రయించుకోవాలని ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా ఉమ్మడి కోటగిరి మండలంలోని హెగ్డోలిలో సోమవారం శనగ రైతులు కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. శనగ పంట ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, మిగిలిన పంట ఎవరికి అమ్ముకోవాలని ప్రశ్నించారు.

వివరాలు మెయిన్‌లో..

బీడీ కార్మికులను దోచుకుంటున్న 'దేశాయి'

- 1500 బీడీలు అదనంగా తీసుకుంటున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ డిమాండ్


కంపెనీ ఎదుట ధర్నా చేపట్టిన నాయకులు, బీడీ కార్మికులు

నవతెలంగాణ-వర్ని

దేశాయి బీడీ కంపెనీలో ఒక్కొక్క కార్మికురాలి నుండి నెలకు 1500 బీడీలు అదనంగా తీసుకొని, బీడీ కార్మికుల శ్రమను దోచుకుంటున్న దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యం, టేకేదార్లపై లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీడీ సిగార్స్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రంలోని దేశాయి బీడీ సెంటర్ ఎదుట సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు.

వివరాలు మెయిన్‌లో..

పేదలకు భూమి దక్కేవరకూ పోరాటం

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీ చేపట్టిన నాయకులు, రైతులు

నవతెలంగాణ-గాంధారి

నిరుపేదలకు భూమి దక్కేంత వరకూ శాంతియుతంగా పోరాటం చేస్తామని సీపీఐ(ఎం) ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతిరాం నాయక్ అన్నారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మాతు సంగెం, పరమలతండా వాసులు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు.

వివరాలు మెయిన్‌లో..

డీఎస్‌కు అస్వస్థత

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ డి. శ్రీనివాస్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రెండు, మూడు రోజుల నుండి నిజామాబాద్‌కు చెందిన మాజీ ఎంపీ డి. శ్రీనివాస్ అస్వస్థతకు గురయ్యారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఆరోగ్యం క్షీణించడంతో హుటాహుటీన బంజారాహిల్స్ సిటీ న్యూరో ఆస్పత్రికి తరలించారు. డీఎస్ అస్వస్థత విషయాన్ని ఎంపీ అర్వింద్ ధృవీకరించారు. ప్రస్తుతం తన తండ్రికి చికిత్స కొనసాగుతోందని తెలిపారు. తన తండ్రి అనారోగ్యం కారణంగా తన రెండురోజుల కార్యక్రమాలు రద్దు చేసుకుంటున్నట్లు ఎంపీ అరవింద్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో, మాజీ మంత్రిగా, పిసిసి చీఫ్‌గా, సీనియర్ నాయకుడిగా పని చేశారు.

కంటి వెలుగు పేదలకు ఎంతో మేలు

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమం మారుమూల గ్రామాల్లోని పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సర్పంచ్ సవిత అన్నారు. సోమవారం మండలంలోని చల్లగర్గ గ్రామములోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపిటిసి గుగులోత్ స్వామితో కలిసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముజిత, వార్డు సభ్యులు కిషన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



టైలర్లకు ఉపాధి కరువు

- రెడీమేడ్‌తో దర్జీలకు తగ్గిన ఆదరణ
- నేడు ప్రపంచ టైలర్స్ దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

సాధారణ వస్త్రాన్ని కత్తిరించి కలిపి కుట్టి రూపు రేఖలు తెచ్చేది ధర్జీలు. ఓ మనిషికి డ్రెస్సులతో హుందాతనాన్ని తీసుకువస్తున్న దర్జీలు కొందరు ఇతర పనులను వెతుక్కుంటున్నారు. మంగళవారం ప్రపంచ టైలర్స్ దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణ ప్రత్యేక కథనం......

టైలర్స్ డే యొక్క చరిత్ర.....

కుట్టుమిషన్ లేని రోజుల్లో షర్టు ప్యాంట్లను కాస్త అటు ఇటుగా చేతితోనే కుట్టేవారు. జర్మన్ దేశానికి చెందిన విలియమ్స్ పో అనే శాస్త్రవేత్త 19 ---పాదాలు ----సంవత్సరంలో కుట్టు మిషన్‌ను కనుగొన్నాడు. ఆయన జన్మదినాన్ని టైలర్స్ డే గా నిర్వహిస్తున్నారు. గతంలో మీరా కులానికి చెందినవారు మాత్రమే దర్జీ వృత్తిని చేపట్టేవారు. పండుగలు శుభకార్యాల సమయంలో వారికి చేతినిండా పని ఉండేది. తిందామన్నా తీరిక ఉండేది కాదు. కాలక్రమేణ ఇతర కులాల వారు దర్జీ వృత్తిని స్వీకరించడంతో పని తగ్గింది. రెడీమేడ్ దుస్తుల రాకతో పరిస్థితి దయనీయంగా మారింది. మార్కెట్లోకి కొత్త కొత్త ఫ్యాషన్లకు అనుగుణంగా రెడీమేడ్ దుస్తులు రావడంతో దర్జీలకు వారికి ఆదరణ తగ్గుతూ వస్తోంది. రెడీమేడ్ దుస్తులు లభిస్తుండడంతో చాలామంది వాటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో దర్జీలకు ఉపాధి తగ్గిపోతుంది. పండుగల సమయంలో గిరాకీ ఉండడం లేదు. చేయడానికి పని లేకపోవడంతో పలువురు దర్జీ వృత్తిని వదులుకొని గల్ఫ్ బాట పట్టారు. గల్ఫు దేశాలలో భావన నిర్మాణ కార్మికులుగా పనిచేయడానికి వెళుతున్నారు. ఇంకొందరు స్థానికంగానే ఉంటూ ఏదో ఒక పని చేసుకుంటూ కాలం వెళ్ళదిస్తున్నారు. గతంలో దసరా పండుగకు రెండు నెలల ముందుగానే సీజన్ ప్రారంభమై బట్టలు కుట్టించుకోవడానికి పండుగకు 10 రోజుల ముందు నుండే కొత్త ఆర్డర్లు తీసుకోకపోయే వాళ్లు. కానీ నేడు రెడీమేడ్ దుస్తులు కొంటున్నారు. పాఠశాల పిల్లలు యూనిఫామ్‌లు సైతం రెడిమెంట్‌వే వస్తున్నాయి.

ప్రోత్సాహం కరువు...

టైలరింగ్ వృత్తిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కార్పొరేషన్ల ద్వారా అంతంత మాత్రంగానే రుణాలు ఇస్తుంది.. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని దర్జీలు కోరుతున్నారు



కూలి రేట్ల ప్రభావం

రెడీమేడ్ దుస్తువుల రాకతో కుట్టించుకున్న దుస్తులు ధరలు ఎక్కువగా ఉండటంతో ఆసక్తి చూపించడం లేదు. సంపన్న వర్గాల వారు మాత్రమే వస్త్రాన్ని కొని దుస్తులు కుట్టించుకుంటున్నారు. కానీ వారు షోరూంలోనే దుస్తులను కుట్టడంతో పేద దర్జీలకు ఉపాధి లభించడం లేదు. ప్రస్తుతం కూలి రేట్లు ఒక్కొక్క డ్రెస్సుకు 800 నుండి వెయ్యి రూపాయలు తీసుకుంటున్నారు.

నేడు పట్టణంలో ర్యాలీ....

అంతర్జాతీయ టైలర్స్ డే సందర్భంగా మేరు కులస్తులచే నిర్వహించే బైకు ర్యాలీ పర్మిషన్ కొరకు ఏసీ పి ప్రభాకర్ రావును కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు.

కులవృత్తులను ప్రోత్సహించాలి...

దర్జీలను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యాశాఖ, పోలీస్ శాఖలో కుట్టించేందుకు టెండర్లను మేరుకులస్తులకు ఇవ్వాలి. దర్జీ వృత్తి మనగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. చేయడానికి పని లేక దర్జీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం కులవృత్తుల సంక్షేమానికి ఎన్నో పథకాలు చేపడుతున్నందున దర్జీలను కూడా ఆదుకోవాలి.

రవి రాజ్, దర్జీ, ఆర్మూర్



పేద, ధనిక తేడాలు ఉండకూడదన్న వ్యక్తి కుటుంబరావు

- సంతాప సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేద ధనికా తేడాలు ఉండకూడదన్న వ్యక్తి కుటుంబరావు అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు పరుచూరి కుటుంబరావు సంతాప సభ పెద్ది వెంకట్ రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రజలందరూ బాగుండాలని కోరుకునే సమ సమాజం నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీలో ముఖ్యమైన నాయకుడిగా పర్చూరి కుటుంబరావు జిల్లాలో పని చేశారని అన్నారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని చివరి వరకు ఆచరించిన వ్యక్తి కుటుంబరావుని తెలిపారు. నేటి పాలకుల విధానాల మూలంగా ప్రజల మధ్య వైశ్యామ్యాలు పెంచి భావోద్వేగాలతో రాజకీయ ప్రయోజనాలకోసం ఆలోచిస్తున్న తరుణంలో ప్రజలు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, అప్పుడే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మిన వ్యక్తి పరుచూరి కుటుంబరావు అని అన్నారు. కష్టజీవుల పక్షాన చివరి వరకు పనిచేయడంతో పాటు కుల, మత, ప్రాంత, తేడాలు లేకుండా ఎక్కడ సమస్య వచ్చినా అందులో జోక్యం చేసుకొని న్యాయం పక్షాన నిలబడ్డారన్నారు. నేటిపాలకులు ప్రజా సంపదను కొద్దిమంది వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారని వాటికి వ్యతిరేకంగా మాట్లాడే గొంతులు నొక్కాలని చూస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టులు మరింత పట్టుదలగా పనిచేయాలని కుటుంబ రావు ఎప్పుడూ చెప్పేవారని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. వెంకటేష్, ఎస్ లత, జిల్లా కమిటీ సభ్యులు జె. గంగాధర్, వై గంగాధర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

శ్రీనివాస రామానుజంలా గొప్పగా ఎదగాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మ్యాథ్స్ విద్యార్థులందరూ శ్రీనివాస రామానుజన్ లాగా గొప్పగా ఎదగాలని, ఆయననుండి స్ఫూర్తి పొందాలని, శ్రీనివాస రామానుజాన్ని ఫాదర్ ఆఫ్ ఇన్ఫినిటీ అంటారని టీయూ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ రవీందర్ అన్నారు. "జోవియాలిటి ఆఫ్ మ్యాథమెటిక్స్ " అనే అంశంపై మ్యాథమెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఒక్కరోజు కార్యాశాలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రవీందర్ పాల్గొని మాట్లాడుతూ శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా జరుపుకునే జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని కార్యాశాల జరుపుకోవడం గొప్ప విషయమని, త్వరలో టీయూలో 3000 మందికి సరిపడా ఆడిటోరియంకు శంకుస్థాపన చేస్తామని, దీనికి ప్రణాళికలను సిద్ధం చేయాలని అసిస్టెంట్ ఇంజనీర్ వినోద్‌ను కోరారు. ఆడిటోరియం లేక, సెమినార్ హాల్లో స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ఎన్ఐటీ వరంగల్ (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) నుండి డాక్టర్ దీపిక లీల అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ నుండి స్ఫూర్తి పొందాలని, గణితంపై పట్టు సాధించాలని, గణితం ద్వారానే సమాజంలో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. వైస్ ఛాన్సలర్ కేక్ కట్ చేశారు. ప్రధాన వక్త దీపిక లీలను వీసీ సన్మానించారు. సమావేశంలో యూనివర్సిటీ ప్రిన్సిపాల్, కన్వీనర్ ప్రొఫెసర్ ఆరతి, కోఆర్డినేటర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్) అధ్యాపకులు కె శ్వేత, ఎం.చంద్రశేఖర్, యు. పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మృతిని నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- మెడికల్ కాలేజీల్లో ర్యాగింగ్ ఈవ్ టీజింగ్‌లను నివారించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలో మెడికల్, ఇంజనీరింగ్, జూనియర్ విద్యార్థులపై సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్, వేధింపులపై ప్రభుత్వ ఉదాసీనతను నిరసిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ముందు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ... వరంగల్ మెడికల్ కాలేజీ విద్యార్థి ధరావత్ ప్రీతి మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని, సైఫ్‌తోపాటు, బాధ్యులందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యానేరం కింద కేసులు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రీతి కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఎస్.కే అషర్, జిల్లా నాయకులు మహిపాల్, నగర నాయకులు జాహ్నవి, తిరుమలేష్, తిలక్, రాజేష్, రూపేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సైఫ్ ను కఠినంగా శిక్షించాలి

మెడికల్ కాలేజీ విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన సైఫ్ ను చట్టప్రకారం శిక్షించాలని, ప్రీతి మృతి పై సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో దహనం చేశారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకమైన డ్రైవ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మనోజ్, దేవిక, నిఖిల్, నగర నాయకులు విజయ్, రంజిత్, ఆకాష్, సచిన్ పాల్గొన్నారు.

కంఠేశ్వర్: కేఎంసి పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి మృతి ని నిరసిస్తూ వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బుస్సాపూర్ శంకర్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీనియర్ వైద్య విద్యార్థి "సైఫ్" తనను వేధిస్తున్నాడని ప్రీతి పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని కేఎంసి ప్రిన్సిపాల్, హెచ్‌ఓడి, పోలీసులు, ర్యాగింగ్‌ను నియంత్రించలేని కేసీఆర్ ప్రభుత్వం ఈ మృతికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. నిందితులపై వెంటనే హత్యా నేరం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై హైకోర్టు సిట్టింగ్ న్యాయ మూర్తి ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ప్రీతి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు కస్తూరి ప్రవీణ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు అంకార్ గణేష్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు బాలేకార్ మనీష్ తేజ, జిల్లా బీసీ విభాగం ఉపాధ్యక్షులు హనుమయ్య నగర మహిళా విభాగం అధ్యక్షురాలు బుడిగే హరిని, నాయకులు, సంతోష్, తల్లా సాగర్, అబ్దుల్ సలీమ్, మహిళ నాయకురాలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన పిప్రి గౌడ సంఘం నేతలు

నవతెలంగాణ-ఆర్మూర్

ముఖ్యమంత్రి కేసీఆర్ దేశం మెచ్చే అభివృద్ధి ప్రధాత అని, సకల జనహృదయ విజేత అనిపీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. మండలం లోని పిప్రి గ్రామానికి చెందిన వందలాది గౌడ సామాజికవర్గం కుటుంబాలు సోమవారం వివిధ పార్టీలకు గుడ్ బై చెప్పి బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. గౌడ సంఘాల ముఖ్య నాయకుల ప్రవీణ్ గౌడ్, రవితేజ గౌడ్, వంశీ, మహేందర్, సురేందర్, సుదర్శన్, నర్సాగౌడ్ తదితరుల నాయకత్వంలో వందలాది మంది ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో బీఆర్ ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్ లోని బంజారాహిల్స్ రోడ్ నెం12 -మినిస్టర్ క్వార్టర్స్ లో గల ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నివాసంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గులాబీ తీర్థం పుచ్చుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం లో అద్భుతమైన ప్రగతి సాధించేలా గొప్పగా పాలిస్తున్న కేసీఆర్ ప్రభుత్వ ప్రగతిశీలక ఆలోచనా విధానం పట్ల తామంతా ఆకర్షితులమై టీఆర్ఎస్‌లో చేరినట్టు గౌడ సంఘాల నాయకులు, సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పిప్రి గ్రామ ఉప సర్పంచ్ ఆసపురం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసి సురేష్, పీఏసీఎస్ ఛైర్మన్ సోమ హేమంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసి శ్రీనివాస్ గౌడ్, చిన్న భోజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారికి కండువావేస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఫిట్నెస్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో ఫిట్నెస్ సెంటర్ ను రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, ఒలంపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ రోజుల్లో అందరికీ వ్యాయామం ఎంతో ముఖ్యమని, మనిషికి ఆరోగ్యమే మహా బలమని, ప్రతి ఒక్కరూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లతా కన్నీరాం, జడ్పీటీసీ కమల నరేష్, సిర్పూర్ సర్పంచ్ ముత్యం రెడ్డి, ఫిట్నెస్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ నవనీత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఫిట్నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మదన్ పల్లి గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్లు ఆధ్వర్యంలో మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం పోస్టర్లు జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు సవిత ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్గ, కులం, మతం, జాతి, జెండర్ సమస్యల్ని పరస్పర అనుబంధాలను అర్థం చేసుకుంటూ మహిళలు ఐక్యంగా పోరాడాలని అన్నారు. మహిళలపై దాడులు, ర్యాగింగ్, అత్యాచారాలకు పాల్పడుతున్నారని, వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళ పోరాట దినాన్ని మార్చి 1 నుంచి 8వ వరకు గ్రామాలలో, మండలాల్లో, డివిజన్ స్థాయిలలో ప్రదర్శనలు, ధర్నాలు, సదస్సులు నిర్వహించాలని అన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో స్వరూప, బడ్డెమ్మ, సాయమ్మ, నర్సు బాయ్, లక్ష్మి, నందన తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రికార్డులు తనిఖీ

నవతెలంగాణ-మోర్తాడ్

మండలం ధర్మోరా ఉన్నత పాఠశాలలో దొనకల్ కాంప్లెక్స్ గెజిటెడ్ పదోనోపాధ్యాయులు రికార్డులను తనిఖీ చేశారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాలను తనిఖీ చేస్తూ పదవ తరగతి విద్యార్థుల అంతర్గత మార్పులను పరిశీలించారు. ఒక్కో సబ్జెక్టులో విద్యార్థులు రాసిన పుస్తకాలను తనిఖీ చేస్తూ సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయులు వేసిన మార్కుల విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పదో తరగతి బోర్డ్ ఎగ్జాంకు విద్యార్థులు చక్కగా చదువుకొని ఉత్తీర్ణులు కావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యకుమారి ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు



రికార్డులు తనిఖీచేస్తున్న ప్రధానోపాధ్యాయులు

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అదజేస్తున్న మిత్రులు

నవతెలంగాణ నందిపేట్

తమతో పాటు పదవ తరగతి వరకు విద్యనభ్యసించిన మిత్రుడు అకాల మరణం చెందడంతో తోటి స్నేహితులంతా కలిసి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. సోమవారం మండల కేంద్రంలో పాతూరులో గత కొద్ది రోజుల కిందట అరుట్ల శ్రీకాంత్ అనే యువకుడు గుండెపోటుతో మరణించాడు . శ్రీకాంత్ కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబానికి 1999-2000 బ్యాచ్ మిత్రులు రూ.లక్షా50వేలు జమ చేసి అందజేశారు. తపాలా కార్యాలయం యందు సుకన్య సమృద్ధి యోజన పథకం కింద పిల్లలిద్దరికీ బీమా చేయించారు. అంతేకాకుండా మిత్రులందరు శ్రీకాంత్ ఇంటికెళ్లి మిత్రుని కుటుంబ సభ్యులను ఓదారుస్తూ పిల్లలిద్దరినీ మంచిగా చదివించాలని, అధైర్య పడవద్దని ఎటువంటి ఇబ్బందులు వచ్చినా మేమన్నామని ధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో బద్దం సాయి రెడ్డి, దుబాయ్ శ్రీను, టైగర్ లింగం, కొత్తూరు గంగాధర్, షాపూర్ రాజ్కుమార్, కొందపురం దేవేందర్, రాజేశ్వర్ తాత, నరేందర్, మాడ మహేష్, కొండి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాదా సీదాగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-మెండోర

మండలకేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బురుకల సుకన్య కమలాకర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం రెవెన్యూ, ఉద్యాన, వైద్య , ఆరోగ్య వ్యవసాయ, ఐకేపీ, విద్యుత్, ఆర్టీసీ, ఐసీడీఎస్, ఇరిగేషన్ శాఖల అంశాలపై అధికారులు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులకు, కింది స్థాయి అధికారులకు పలు అంశాలపై అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి అర్హులకు పథకాలను అందించేలా విధులు నిర్వహించాలని సూచించారు. మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల రాకపోకలకు వీలుగా ఆర్టీసీ బస్సు మెండోర మండల కేంద్రం మీదుగా సావెల్ వరకు అధిక ట్రిప్పులు నడపటంతోపాటు మండల కేంద్రానికి ప్రభుత్వ ఉద్యోగులు రావడానికి బుస్సాపూర్ గ్రామంలో ఎక్స్ ప్రెస్ బస్సులు రిక్వెస్ట్ స్టాప్ పెట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మండల పరిధిలో నిర్మాణం అయ్యే అవకాశం ఉన్నందున రైతులు ఆయిల్ ఫామ్ సాగుకు కృషి చేయాలని కోరారు. సమావేశంతో ఎంపీపీ బురుకల. సుకన్య కమలాకర్, డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్.శేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ పడాల సరస్వతి రవీందర్ గౌడ్, తహసీల్దార్ సతీష్ రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి రాజ్ కుమార్, సావెల్ సొసైటీ చైర్మన్ మచ్చర్ల.రాజ రెడ్డి , ఎపియం విక్రమ్ రెడ్డి , వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బోర్ బావికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఉపసర్పంచ్

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నీటి సమస్య ను తీర్చడానికి సోమవారం బోర్ బావి వేసేందుకు సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్ జక్క గంగాధర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభ నిధుల ద్వారా ఈ బోర్ బావికి భూమిపూజ చేశామన్నరు. నిధుల విడుదలకు కృషి చేసిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పిప్పేరా గణేష్, యువజన సంఘం నాయకులు, గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో వైద్య శిబిరం



చికిత్స చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆయుర్వేదిక్ న్యాచురల్ అర్బన్ న్యూట్రిషన్ వారి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ రాజ్ రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్, కీళ్లనొప్పులు, నడుము నొప్పి, అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. మంచి పోషకాలు ఉండే తాజా ఆకుకూరలు, పండ్లు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ప్రతి ఒక్కరికి నడక ఎంతో మంచిదని తప్పనిసరిగా అరగంటైనా నడవాలన్నారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సక్కారం అశోక్ ప్రారంభించారు. కార్యక్రమంలో నేల్ల రమేష్, గంగారం, భాశెట్టి గంగాధర్, భూమన్న, సక్కరం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి వరంలాంటిది



చెక్కు అందజేస్తున్న పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాంటిదని, పేద నిరుపేదలకు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని ఇందల్ వాయి మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఇందల్ వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి సంబంధించిన ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 16 వేల చెక్కును గడ్డం సంగీతకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాపురావు, మండల పార్టీ కోశాధికారి పంపరి రమేష్, మండల రైతు విభాగ అధ్యక్షులు బొడ్డు రవి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పులి వసంత, సోషల్ మీడియా నాయకులు మఠంల నాగేష్, సుబ్బారావు, సుగ్గెం దాసు, లక్కాకుల రాజేశ్వర్, రవి, శ్రీనివాస్, లింగం, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటి సంరక్షణపై అవగాహన

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు కంటి అద్దాల పంపిణీ చేశారు. అనంతరం గాలి, నీరు వాతావరణం కాలుష్యం కాకుండా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు పేర్కొన్నారు. నీటి సంరక్షణ, నీటి యాజమాన్యం, వాన నీటిని ఒడిసి పట్టడం, సేంద్రియ వ్యవసాయం నీటిపారుదలపై సంరక్షణ, నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం వంటి వాటిపై గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సీఎఫ్ చింత శ్రీనివాస్, ఎస్.కె. సయ్యద్ పంచాయతీ కార్యదర్శి అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధి రామేశ్వర్‌నగర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆరోగ్య శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి యేమిమా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రస్తుతం వేసవి కాలం సందర్భంగా నీటిని ఎక్కువ తాగాలని, ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జనగామ శ్రీనివాస్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, ఏఎన్ఎం యాదమ్మ, ఆశా కార్యకర్త నీలిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి.. అస్తికలు లభ్యం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

అదృశ్యమైన వ్యక్తి అస్తికలు లభ్యమయ్యాయి. ఏఎస్ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చాకలి గంగాధర్ (32) గత నాలుగు నెలల క్రితం అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం పెద్దకొడప్‌గల్ ఊర చెరువు వద్ద స్థానికులకు శవం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడు గంగాధర్ వేసుకున్న దుస్తులు, మెడలో ఉన్న జమాలను బట్టి గంగాధర్ మృతదేహంగా నిర్ధారించారు. అనంతరం ఘటన స్థలంలోనే బాన్సువాడ వైద్యులు మోహన్‌రెడ్డి శవ పరీక్షలు చేసి డీఎన్ఏ పరీక్ష కోసం మరబోన్‌ను తీసుకెళ్లారు.

తెలంగాణ బచావో సదస్సును విజయవంతం చేయండి

- తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ నిజ్జన రమేష్
- గోడప్రతుల ఆవిష్కరణ

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ బచావో సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ నిజ్జన రమేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర మార్చ్ 10న తెలంగాణ బచావో సదస్సు పోస్టర్‌ను తెలంగాణ జన సమితి పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ నిజ్జన రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిజ్జన రమేష్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మిలియన్ మార్చ్ స్ఫూర్తితో తెలంగాణ బచావో సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారులను నిండ ముంచారని ఆయన మండిపడ్డారు. అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయడం లేదని అమరవీరుల పాపం ప్రభుత్వానికి తలుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజల జీవితాలతో అడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించకుండా నిరుద్యోగ భృతి అమలు చేయలేదని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేస్తుందన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేశాడని, విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. కార్పొరేట్ విద్యను పెంచి పోషించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా కో-కన్వీనర్ జడల రజినీకాంత్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు చాకలి కుమార్, జిల్లా నాయకులు పూల్‌సింగ్ నాయక్, గోపాల్ ముదిరాజ్, కిష్టయ్య యాదవ్, పవన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేటకు చెందిన శెట్టిపల్లి రాజశేఖర్ ఆదివారం ఆత్మహత్య చేసుకోగా.. మాజీమంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5000 అందజేశారు. అలాగే కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్ రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్‌ను శివారు ప్రాంతంలో నిర్మించవద్దు


వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఊరికి కిలోమీటర్ దూరంలో కూరగాయల మార్కెట్‌ను నిర్మిస్తున్నారని, వెంటనే కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను నిలిపివేసి గ్రామంలో కూరగాయల మార్కెట్ నిర్మించాలని కోరుతూ సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మికి గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. రూ.17లక్షల నిధులతో నిర్మించనున్న కూరగాయల మార్కెట్ గ్రామానికి దూరంగా ఉండటంతో ఎందుకు పనికి రాకుండా పోతుందని, నిధులు దుర్వినియోగానికి గురవుతాయని, వెంటనే కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని గ్రామంలో నిర్మించాలని కార్యదర్శిని కోరారు.

పల్లె ప్రకృతి వనం సందర్శన

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని మాదన్‌హిప్పర్గ గ్రామపంచాయతీ పరిధిలో పల్లె ప్రకృతి వనాన్ని సర్పంచ్ రాజు పటేల్ సోమవారం సందర్శించి పరిశీలించారు. పల్లె ప్రకృతి వన కేంద్రంలో ప్రభుత్వ ఆదేశానుసారంగా మొక్కలు పెద్ద ఎత్తున పెంచుతున్నట్టు తెలిపారు. సర్పంచ్ వెంట గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల సమైఖ్య సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని మండల సమైక్య ఆఫీసులో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక అంశాలు, పుస్తక నిర్వహణ, అకౌంటింగ్, బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలు, సోలార్ మొదలైన అంశాలపై ఏపీఎం రాజారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సంఘాల అధ్యక్షురాలు, తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి తండాలో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని మౌలాలి తాండ గ్రామంలో సర్పంచ్ జాదవ్ సునీత బాబునాయక్, రైతుబంధు జిల్లా నాయకులు మౌలానా కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపి రవీందర్, శ్రావణ్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు చైర్స్, బోధన ఉపకరణాల అందజేత


ఉపకరణలు అందజేస్తున్న గైని శ్రీనివాస్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయుడు గైని శ్రీనివాస్ తండ్రి గైని నడిపి గంగారాం జ్ఞాపకార్థం వికలాంగుల విద్యార్థులకు చైర్స్, బోధన ఉపకరణాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, అనిత, మూర్తి, లింగన్న, షబానా తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్
- పలుచోట్ల నిరసనలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డిటౌన్ : ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా అధ్యక్షులు పేరుమండ్ల బుల్లెట్ డిమాండ్ చేశారు. సోమవారం వరుస మెడికల్, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఆత్మహత్యలను నిరసిస్తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ర్యాగింగ్ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి విఠల్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్య నిలయాలుగా విశ్వవిద్యాలయాలు మారుతున్నాయని అన్నారు. మెడికల్ విద్యార్థి ప్రీతి తన సీనియర్ ర్యాగింగ్ వల్ల చనిపోయిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం, శ్రీరామ్, పట్టణ నాయకులు రాహుల్, వెంకట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్ : వరంగల్ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌కు బలైన గిరిజన వైద్య విద్యార్థి ప్రీతి నాయక్ మృతి ఘటనలో ఉన్నత స్థాయి విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బోధన్ పట్టణంలోని రైల్వే గేటు వద్ద గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి సంఘం బోధన్ నియోజకవర్గ ఇంచార్జి జాదవ్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ.. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులపైన దాడులను అరికట్టాలని కోరారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తే మరో విద్యార్థిని బలి కాకుండా ఉంటుందని అన్నారు. అనంతరం ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఆర్డీఓ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. నిరసనలో బానోత్ విష్ణు, శ్రీనివాస్, సాయికుమార్, బాబునాయక్, రవికుమార్, గిరిజన బాలికల వసతి గృహం విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలి..

జుక్కల్ : డాక్టర్ దరావత్ ప్రీతి మెడికో విద్యార్థిని మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలని కోరుతూ ఆల్ ఇండియా బంజారా సేవాసమితి సంఘం మండలాధ్యక్షుడు జాదవ్ రాజు ఆధ్వర్యంలో జుక్కల్ ఎస్ఐ మురళికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సేవా సంఘం మండలాధ్యక్షుడు జాదవ్ రాజు మాట్లాడుతూ.. వైద్యవిద్యారంగలో ఉన్నత విద్యను అభ్యసిస్తూ సీనియర్ విద్యార్థి ర్యాగింగ్ భూతానికి ఆత్మహత్యకు పాల్పడిన వారిపైన కఠిన చర్యలు తీసుకావలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రీతి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

పిట్లం : మెడికో విద్యార్థి ధరావత్ ప్రీతి ఆత్మహత్యకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ప్రీతి ఆత్మహత్యకు నిరసనగా బీజేపీ, గిరిజన సంఘాలు, పలు పార్టీల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజ్ విద్యార్థిని ధరావత్ ప్రీతిపై సీనియర్ విద్యార్థి ర్యాగింగ్‌కు పాల్పడి చిత్ర హింసలకు గురి చేయడంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని కారకులైన వారిని శిక్షించాలని, నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంజారా రాష్ట్ర, జిల్లా నాయకులు బాబు సింగ్, కాట్రోతు రవీందర్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, జగదీష్, బీజేపీ నాయకులు రాము, అశోక్ రాజ్, శివ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : డాక్టర్ ధారావత్ ప్రీతి నాయక్ పీజీ విద్యార్థి ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాథోడ్ అశోక్ సింగ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

టీజీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..

బోధన్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు మీసాలే నాగేష్ మాట్లాడుతూ.. గిరిజన బిడ్డలపై, విద్యార్థులపై జరుగుతున్న హత్యలు, ర్యాగింగ్‌లను టీజీవీపీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. కనీసం కేసీఆర్, కేటీఆర్ ఈ ఘటనలపై స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కేఎంసీ కాకతీయ మెడికల్ కాలేజ్‌లో యాంటీ ర్యాగింగ్ అమలు కావడం లేదని, అది కేవలం అగ్రకులస్తులకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. వైద్య విద్యార్థి ప్రీతి మృతికి ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీ, ఏసీపీలే కారణమని ఆరోపించారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, అలాగే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శశిధర్, నిఖిల్, అశోక్ తదితరులున్నారు.


జుక్కల్ : ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


పిట్లం : బీజేపీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం

యాదవులు ఆర్థికంగా ఎదగాలి

- ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

యాదవులు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం మండలంలోని బోనాల్ గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొదటగా టీడబ్ల్యూ రోడ్డు నుంచి బోనాల్ గ్రామం వరకు రూ.30లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం యువకులు, నాయకులతో కలిసి బైక్‌పై ర్యాలీగా వెళ్లగా.. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.8లక్షల 50వేలతో గిడ్డంగి నిర్మాణం చేపట్టగా దానిని ప్రారంభించారు. గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం రూ.10లక్షలతో నిర్మించిన సీసీ డ్రయినేజీలను, రూ.25లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, గ్రామంలోని అన్ని వీధులలో తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలందరిలో కలిసి ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న బీరప్ప కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాలకు గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవంలో రూ.11వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుశీల సాయిగౌడ్, జడ్పీటీసీ ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, ఎంపీపీ గరీబునీసానయీం, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ నరహరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దేశనాయక్, ప్రతియుద్దీన్, రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు బాలయ్య, రామ్‌రెడ్డి, జిలియా నాయక్, పరశురాం, బన్నిసక్రు, మండలాధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ, గన్నునాయక్, విట్టల్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మి, సాయిలు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, మండల నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


బీరప్ప కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే

ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏవో రవీందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు వెంటనే ఇవ్వాలని, అలాగే అర్హులైన వారందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని అన్నారు. అలాగే జిల్లాలో రైతుల భూములను బైనంబర్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లాక్కుంటున్నారని, వారిపైన క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. పై సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున కలెక్టర్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి పి.బాలరాజ్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు దేవయ్య, పి.రాజు, సీపీఐ జిల్లా నాయకులు ఈశ్వర్, కాసిం, మనమ్మ, సాయిలు, ఎం.లక్ష్మి, బాలమణి, హనుమాన్లు, నరేష్, సవిత, భూలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ప్రిన్సిపాల్ భానుమతి

నవతెలంగాణ-సదాశివనగర్

పదవ తరగతి విద్యార్థులు ఉదయం, సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్‌కు పిల్లలను తప్పకుండా హాజరయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులుదేనని.. దీని ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ప్రిన్సిపాల్ భానుమతి అన్నారు. సోమవారం ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు ప్రారంభమయ్యాయని, ఉదయం 8:30 గంటల నుంచి 9:30 గంటల వరకు.. సాయంత్రం నాలుగున్నర నుంచి 6గంటల వరకు స్పెషల్ క్లాసులు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని తల్లిదండ్రులు సమయానికి పిల్లలను పంపాలని కోరారు. స్టడీ అవర్స్ వల్ల అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని తెలిపారు. దీనికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అనంతరం ఎస్ఎంసీ చైర్మన్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని సాయంత్రం స్నాక్స్ సైతం ఏర్పాటు చేసిందని, విద్యార్థులు కష్టపడి చదివి ఫలితాలను సాధించాలని కోరారు. విద్యార్థులకు అభ్యాస దీపికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బీరయ్య, సొసైటీ చైర్మన్ కమలాకర్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అభ్యాస దీపికలను అందజేస్తున్న ప్రిన్సిపాల్

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పిట్లం

కంటి వెలుగును గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దుర్గయ్య కోరారు. సోమవారం మండలంలోని కారేగాం గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో గ్రామస్తులు కంటి పరీక్షలు చేసుకొని ఉచితంగా కంటి అద్దాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ జాకీర్ హుస్సేన్, గ్రామస్తులు పాల్గొన్నారు.


కంటివెలుగును ప్రారంభిస్తున్న సర్పంచ్

'ప్రజల వద్దకు ఆర్టీసీ'పై అవగాహన

నవతెలంగాణ-బోధన్

మండలంలోని రాంపూర్, కల్దుర్కి, సిద్దాపూర్, ఖండ్గాం గ్రామాలలో బోధన్ డిపో మేనేజర్ స్వామి ప్రజల వద్దకే ఆర్టీసీ కార్యక్రమంపై గ్రామస్తులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రభుత్వం వివిధ రకాల రాయితీలను అందిస్తుందని అన్నారు. విద్యార్థులకు, వికలాంగులకు బస్సు పాసులను అందిస్తున్నామని, శుభకార్యాలకు అద్దెపై ఆర్టీసీ బస్సులను అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. కావున ప్రజలు ఆర్టీసీ బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ పటేల్, లాలు, సుదర్శన్, గ్రామస్తులు నరేష్‌రెడ్డి, విట్టల్, రమేష్, సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

4వ విడత నిజాంసాగర్ నీటి విడుదల


కెనాల్‌లో పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఏఈ

నవతెలంగాణ-బోధన్

యాసంగి సీజన్‌లో భాగంగా రైతులు సాగుచేస్తున్న పంటలకు ఇరిగేషన్ శాఖ అధికారులు సోమవారం నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా 2000 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. ఇరిగేషన్ ఏఈ శృతి నీటి సరఫరాను పరిశీలించారు. సాలూర క్యాంప్ వద్ద డీ-28 కెనాల్‌లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని రైతుల సహకారంతో ఆమె తొలగించేలా చర్యలు చేపట్టారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా విడుదలైన 2వేల క్యూసెక్కుల ఈ సాగునీరు 30 వేల ఎకరాలకు అందించనున్నట్టు తెలిపారు. డీ-1 కెనాల్ నుంచి డీ-49 కెనాల్ అలీసాగర్ వరకు సాగునీటిని ఫిబ్రవరి 23వ తేదీ నుంచి 10 రోజుల పాటు రైతులకు సాగునీరు అందించనున్నట్టు తెలిపారు. ఆమె వెంట రైతులు రాజేందర్, సుబ్బారావు, రైతులున్నారు.

వీధి కుక్కలను నియంత్రించండి

- కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించండి
- సర్పంచ్‌కు, గ్రామ కార్యదర్శికి వినతి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో వీధి కుక్కలు ఏ వాడలో చూసినా మందలు మందలుగా తిష్ట వేసి తిరుగుతున్నాయని, ఈ వీధి కుక్కల మూలంగా గ్రామ ప్రజలు భయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని, వీధి కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయని, వీటి నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని గ్రామస్తులు సర్పంచ్ సురేష్‌కు, గ్రామ కార్యదర్శి సందీప్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి రచ్చ కుశాల్, యూత్ అధ్యక్షులు గాల్బే హణమంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అవార్ హనుమండ్లు, ఉప సర్పంచ్ విఠల్, వార్డు సభ్యులు సాయి, జ్ఞానేశ్వర్, సాయిలు, నాగేష్ పటేల్, ఉద్యమ నాయకులు హనుమండ్లు తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణా మందు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును సోమవారం వేసినట్టు పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. మండలంలోని జనగాం, లింగంపల్లి, భూంపల్లి గ్రామాల్లో మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందును వేశారు. డాక్టర్ వాటికి తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు గైని అనసూయ, సర్పంచ్ లలిత, సహాయకులు జుగల్ కిషోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీటీవీ శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎస్బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఎస్బిఐ ఎస్ ఆర్‌ఎస్‌ఈసీటీఐ) డిచ్‌పల్లి వారి ఆధ్వర్యంలో సీసీటీవి 13 రోజుల శిక్షణ మంగళవారం నుండి ప్రారంభమవుతుందని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల గ్రామీణ ప్రాంత యువకులు శిక్షణలో పాల్గొనాలని సూచించారు. శిక్షణ తో పాటుగా ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పించ బడుతుందని అయన వివరించారు. శిక్షణా అనంతరం ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తమని తెలిపారు. 19 నుండి 35 సంవత్సరాల వయసు కలిగి ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ యువకులు ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. వివరాలకు 08461 222428, 08461 295428 ఫోన్ నంబర్ లలో సంప్రదించాలని సూచించారు.

జాతీయ సమైక్యత శిబిరానికి తరలివెళ్లిన టీయూ విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆటీఎం యూనివర్సిటీ మహారాష్ట్ర లోని నాగపూర్‌లో ఈనెల 26 నుంచి మార్చి 4 వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాల నుండి పదిమంది విద్యార్థులు సోమవారం తరలి వెళ్లినట్లు తెలంగాణ యూనివర్సిటీ ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త డాక్టర్ కే రవీందర్ రెడ్డి తెలిపారు.ఈ శిబిరం వల్ల విద్యార్థులలో జాతీయ సమగ్రత పెంపొందు తుందని, వాలంటీర్లలో ఉన్న నైపుణ్యాలు పెంపొందు తాయని తెలిపారు. ఈ శిబిరానికి ఎస్ ఆర్ ఎన్ కే బాన్సువాడ ప్రోగ్రాం అధికారి దేవరాజ్, రాజేష్ పర్యవేక్షిస్తున్నారు. మొదటిరోజు వకృత్వం పోటీలలో ఎం. వందన పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు వేయించాలి

- సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్

నవతెలంగాణ-విలేకరుల బృందం

జక్రాన్‌పల్లి : జీవాలకు నట్టల నివారణ మందు వేయించాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని పడకల్ గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమానికి సర్పంచ్ శ్రీనివాస్ హాజరై నట్టల మందు తాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను యాదవులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గంగారెడ్డి, ఉప సర్పంచ్ రిత్విక్, వార్డు సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ముప్కాల్ : మండలంలోని వెంచిర్యాల గ్రామంలో సోమవారంసర్పంచ్ మట్ట సందీప్ గ్రామంలోని గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్టు పశుసంవర్ధక శాఖ సిబ్బంది తెలిపారు. దాదాపు గ్రామంలో 500కు పైగా గొర్రెలకు, మేకలకు మందులు వేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ఉప సర్పంచ్ రమేష్, విఎల్వో సరస్వతి, పసుమిత్ర సభ్యులు ప్రణీత్, లక్ష్మీ, గొర్రెల, మేకల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలోని కొత్తపల్లి, గుంజిలీ, చిక్లి గ్రామాలలో సోమవారం నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. ప్రతి రైతు తమ జీవాలకు నట్టాల నివారణ మందులను వేయించాలని పశు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా 8970 జీవాలకు ఉచిత మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుబ్బారావు, పశు వైద్యురాలు ఉమెమ సాహెర్ వాసు, సాహెరా వసు, వి ఎల్ ఓ వినిత, జేవివో గంగజమున, విఏ అహ్మద్ భాషా, శ్రీనివాస్, సాజిద్, సిబ్బంది సుదీర్, దిలీప్, బేగ్, జైల్ సింగ్, పశువుల యజమానులు పాల్గొన్నారు.

సిరికొండ : మండలంలోని చీమన్ పల్లి, పందిమడుగు, తాటిపల్లి గ్రామాల్లో సోమవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించారు. దీనివల్ల నట్టలు పడిపోయి జీవలు తొందరగా అభివృద్ధి చెందుతాయని, జీవక్రియ మెరుగు పడుతుందని,వెటర్నరీ డాక్టర్ బాబురావు తెలిపారు. గొర్రెలు 6532, మేకలు 4948 మందులు వేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో చీమన్ పల్లి సర్పంచ్ పద్మ శివారెడ్డి, పందిమడుగు సర్పంచ్ భాగ్యలక్ష్మి, తాటిపల్లి సర్పంచ్ తిరుపతి, వెటర్నరీ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఆఫీస్ సబర్డినేట్ సతీష్, పశుమిత్ర మౌనిక, గొర్రెలు, మేకల పెంపకం దారులు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లి : నట్టల నివారణ మందు వేస్తున్న దృశ్యం

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఏవో రవీందర్ అన్నారు. సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రవీందర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామన్నారు. వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. మొత్తం 50 ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వనరులు నేల రకాలు సామాజిక పటంపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-బోధన్

సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు సంబంధించిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శిక్షణ విద్యార్థులు సాలూర మండలంలోని సాలంపాడ్, సాలూర క్యాంప్, జాడిజమాల్‌పూర్ గ్రామాల్లో రైతులకు గ్రామీణ భాగస్వామ్య అంచనా కార్యక్రమంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో రైతులు పంట మార్పిడి చేయకపోవడం, మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడంపై వివరించారు. అలాగే రైతులకు మార్కెట్ సౌకర్యం లేకపోవడం, భూమిలో జింక్ లోపం, పంటలు ఆరబెట్టుకునే సౌకర్యం లేకపోవడంపై రైతులతో చర్చించారు. రైతులకు సాంకేతిక అంశాల నిర్వహణపై సమస్యల చెట్టు పటం గీసిన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఉమా రాజశేఖర్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శ్వేత, సురేష్, గ్రామ పెద్దలు రవి, ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శైలజ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

శనగ రైతుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-బోధన్


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా శనగపంట కొనుగోలు విధానంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిస్కరించాలని కోరుతూ హున్సా సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. త్వరలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు సొసైటీ చైర్మెన్ రవి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వినోద్ బాబా, సంఘం డైరెక్టర్లు ఖజాపూర్ అశోక్, మార్కల్ శివకుమార్, మురిగే మాధవరావు, దేశపెట్ రాములు, పాల్గొన్నారు.

ఎస్‌డీఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్/మెపాల్/జక్రాన్‌పల్లి

13 లక్షల రూపాయలు విలువగల ఎస్‌డీఎఫ్ చెక్కులను ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం పంపిణీ చేశారు. మల్లారం గ్రామంలో దాసరి సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ.5 లక్షలు, మున్నూరు కాపు కమ్యూనిటీ సంఘంకు రూ.5 లక్షలు, చర్చ్ నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయల ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ప్రొసిడింగ్ పత్రాలను గ్రామ కమిటీ సభ్యులకు, సర్పంచ్ నగేష్‌కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనుష ప్రేమ్ నాయక్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మీసాల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

మోపాల్:మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ కి 5 లక్షల రూపాయలు, మున్నూరు కాపు సంఘానికి 5 లక్షల రూపాయలు, మైనార్టీ సంఘానికి మూడు లక్షల రూపాయలను రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తన ఎస్ డి ఎఫ్ నిధులనుండి మంజూరు చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, జెడ్పీటిసి కమల నరేష్, ఎంపీపీ లత కన్నీరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని పడకల్ గ్రామంలో నాలుగు కమ్యూనిటీ హాళ్లకోసం ప్రొసీడింగ్ కాపీలను తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ అందజేశారని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. నిజామాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మార్కండేయ పద్మశాలి సంఘానికి రూ.5 లక్షలు, బీరప్ప కురుమ సంఘానికి రూ.5 లక్షలు, గంగపుత్ర సంఘానికి రూ.5 లక్షలు, మున్నూరు పెరిక కాపు సంఘానికి రూ. 5 లక్షలు చొప్పున ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రిత్విక్ ఎంపీటీసీ గంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖఅధ్యక్షులు రాయశ్వర్ గౌడ్, మాజీ ఎంపిటిసి సుజాత, కులసభ్యులు, వీడిసి సభ్యులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనపై నేడు ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వివిధ మండలాల్లోని స్కూలలో విద్యార్థులకు మూఢనమ్మకాల నిర్మూలన శాస్త్రీయ ఆలోచన పై ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్టు జేవీవి జిల్లా అధ్యక్షులు కొయేడి నర్సింలు, కార్యదర్శి గంగాధర్, కోశాధికారి వెంకట మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని, కార్యక్రమానికి హేచ్ఎం లు, టీచర్స్ సహకరించాలని కోరారు. మంగళవారం నవీపెట్, బడా బింగాల్ హై స్కూల్స్ లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/ఆర్మూర్

బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైలు పరిగెత్తించిన విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ అని నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మాజి నరేష్ అన్నారు. మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చంద్రశేఖర్ ఆజాద్ స్వాతంత్ర పోరాటంలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమకారుడని, స్వేచ్ఛాయుత భారతం కోసం అమరుడైన విప్లవ ధీరుడని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు సొప్పరి వినోద్, తారక్ జితేందర్, నవీన్ రాకేష్ శ్రీకాంత్, ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : చంద్రశేఖర్ ఆజాద్92వ వర్ధంతిసందర్భంగా సోమవారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లోఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బి కిషన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు యం నరేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్, పీవైఎల్ జిల్లా నాయకులు మనోజ్ మండల కార్యదర్శి శీను, నాయకులు వంశీ భోజన్న నవీన్ సిద్దు విజయ్ తదితరులు పాల్గొన్నారు

ప్రజావాణికి 137 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 137 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జెడ్పి సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఆర్జీలను వెంటనే పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన ఆర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయడంతో పాటు చేపట్టిన చర్యల గురించి అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చిట్ల పార్థసారథిని సోమవారం దుబాయ్ లోని ఎమిరెట్స్ ఫార్మసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినారు... అనధికారిక పర్యటనలో భాగంగా దుబాయ్ వెళ్లిన పార్థసారథి నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ వాసులు కలిసి వారి సేవలను గుర్తించి ఘనంగా సన్మానించినారు. దుబాయిలో డాక్టర్లుగా ఫార్మాసిస్టులుగా స్థిరపడిన వార ,జిల్లాలోని పట్టణవాసి అయినటువంటి పార్థసారథి అత్యున్నత స్థాయికి చేరుకొని ఎంతో గుర్తింపు పొందడం గర్వకారణమని పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ఎండి ఇంతియాజ్ హమ్మద్ కొని ఆడారు. కార్యక్రమంలో ఇండో ఆరాబు కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ లిటరేచర్ కన్వీనర్ మమ్మద్ అది అల్లా, డాక్టర్ ఇష్తేకర్, డాక్టర్ హమీద, హలీముద్దీన్ ,ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

మగ్గిడి పాఠశాలలో మన ఊరు మనబడి పనుల పర్యవేక్షణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనులను మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ నితీష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత, నర్సయ్య, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

యాల్ల రాములు విగ్రహానికి నివాళులు

నవతెలంగాణ-ఆర్మూర్

జేఏసీ ఎంప్లాయీస్ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి అమృత్ కుమార్, కార్యవర్గ సభ్యులు సోమవారం మాజీ ఎంపీపీ యాల్ల రాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వారి పెద్ద కుమార్తె టీఎన్జీవోఎస్ నాయకురాలు తార, తదితరులు పాల్గొన్నారు.

గోసంగి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం గోసంగి సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2023 క్యాలెండర్‌ను ఎస్ఐ రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోసంగి సంఘం జిల్లా సలహాదారు ఈర్నాల గంగాధర్ మాట్లాడుతూ.. క్యాలెండర్లను మండలంలోని గోసంగి సంఘ సభ్యుల ఇంటింటికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సద్దుల రవ, మండల అధ్యక్షులు ఊరా నర్సయ్య, ఉపాధ్యక్షులు విభూది అనిల్, కోశాధికారి కాడమంచి లింబద్రి, రాజన్న, విఘ్నేష్, శ్యామ్, రమేష్, సతీష్, నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ నిధుల కింద మంజూరు చేసిన తొమ్మిది లక్షల నిధులతో డోంగ్లి మండలంలోని లింబూర్ గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్టు సర్పంచ్ మధుకర్ పటేల్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈజీఎస్ ద్వారా గ్రామ పంచాయతీకి తొమ్మిది లక్షల నిధులు మంజూరైనట్టు తెలిపారు. 9 లక్షల నిధుల్లో నాలుగు లక్షల రూపాయల నిధులు పంచాయతీ పరిధిలోని వాడి గ్రామంలో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్టు, మిగిలిన 5 లక్షల నిధులు లింబూర్ గ్రామంలో అవసరమున్న చోట సీసీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగిస్తున్నట్టు తెలిపారు.


గాంధారి : పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

సీసీ డ్రయినేజీ పనులు పరిశీలన..

రెంజల్ : మండలంలోని నీలా గ్రామంలోని కాలనీలను మండల ఉపాధ్యక్షులు యోగేష్, సీనియర్ నాయకులు మేక సంతోష్ పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు కాగా.. ఆ నిధులతో అత్యవసరమైన కాలనీలలో సీసీ డ్రైనేజీ పనులను ప్రారంభించనున్నట్టు వారు పేర్కొన్నారు. వారి వెంట స్థానిక యువత అభినందన్, గంగాధర్, అనిల్ తదితరులున్నారు.

గాంధారి : మండల కేంద్రంలో గల గుండమ్మ కాలవ రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్డి రాజు, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు జింగురు సురేష్, బీఆర్ఎస్ నాయకులు సాయిలు, రవి, వెంకట్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : మండలంలోని సంగమేశ్వర గ్రామంలో సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్, ఎంపీపీ కానుగంటి శారద సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా మాట్లాడుతూ.. దోమకొండ మండలంలోని అన్ని గ్రామాలకు ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా రెండు కోట్ల ఇరవై ఐదు లక్షల నిధులు మంజూరైనట్టు, సంగమేశ్వర్ గ్రామానికి ఇరవై ఐదు లక్షల రూపాయలు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినట్టు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలిపారు. అన్ని గ్రామాల అభివృద్ధికై విప్ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కానుగంటి నాగరాజు, మండలాధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావు, వైస్ ఎంపీపీ పుట్ట బాపురెడ్డి, మాజీ సర్పంచ్ కరికే సుమలత మురళి, గన్నామనేని మహేందర్‌రావు, మన్నే నవీన్, గన్నామనేని రాజేశ్వర్ రావు, నీల స్వామి, నీల కృష్ణమూర్తి, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తప్పుడు ఇంటి నెంబర్‌లతో కబ్జాలపై చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇండ్ల ముందు తప్పుడు ఇంటి నెంబర్‌లను పెట్టి స్థలాన్ని కబ్జా చేస్తున్న వారి పైన చర్యలు తీసుకోవాలని టౌన్ అధ్యక్షుడు మల్లమారి సుధాకర్ అన్నారు. పెద్ది రామకృష్ణ తండ్రి మహేష్ అనే వ్యక్తి ప్రభుత్వ స్థలం క్వార్టర్స్ ప్రాంతంలో తప్పుడు ఇళ్ళు ఫోటోలు (మున్సిపల్ కార్పొరేషన్ నిజామాబాద్) ఎంఎన్సీ అధికారులకు సమర్పించి మున్సిపల్ నెంబర్ తప్పుగా పొంది, తన కొడుకు పై రిజిస్ట్రేషన్ చేయించు చున్నారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్రం టౌన్ అధ్యక్షుడు మల్లమారి సుధాకర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారు సమర్పించిన ఇంటి ఫొటోస్ గౌడ సంఘనికి సంబంధించినవి అని టి. ఉమ మహేశ్వర్ రావు తండ్రి శాస్త్రి ఇంటికి సంబంధించినదని తెలిపారు. ఇంటి నెంబర్‌ను, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు. పెద్ది మహేష్ అనే వ్యక్తి గతంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్రం కు సంబంధించిన స్థలాన్ని కూడా తప్పుడు ఫొటోతో ఎంఆర్‌పీఎస్ బోర్డ్‌ను, జెండను తొలగించి కబ్జా చేశాడని అన్నారు. ఆయనపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

కలెక్టరేట్ ముందు అన్నదానం..

నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ మెయిన్ గేటు ముందు ప్రజాసేవ సైన్యం అధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ కు ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చే బాధితులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సేవ సైన్యం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు టి.చిన్న విఠల్ మాట్లాడుతూ సమస్యలను విన్నవించేందుకు కలెక్టరేట్‌కు వచ్చే వారికి ఆహారాన్ని అందిస్తే కనీసం వారికి సహకారంగా ఉంటుందని అన్నదాన కార్యక్రమం నిర్వహించమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి. వినోద్ కుమార్, సభ్యులు, రిటైర్డ్ ఆర్టిసి నిజామాబాద్ 2 డిపో అలీ భాయ్, గంగాధర్, అభిషే, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హెూటల్ మేనేజ్మెంట్ విద్యతో మంచి ఉపాధి అవకాశాలు

- రీజెన్సీ హెూటల్ మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారతదేశంతో పాటు విదేశాల్లోని ఉత్తమ బ్రాండ్ హెూటళ్లలో హెూటల్ మేనేజ్మెంట్ విద్యార్థులు పనిచేయడానికి యువతకు ఉపాధి నైపుణ్యాలతో పాటు సాధికారత కల్పించడానికి తమ కళాశాల నాణ్యమైన విద్యను అందిస్తుందని, విద్యార్థులకు అనేక ఉద్యోగావకాశాలను సృష్టిస్తుందని రీజెన్సీ హెూటల్ మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం రీజెన్సీ హెూటల్ మేనేజ్మెంట్ కళాశాల ఆధ్వర్యంలో నగరంలోని కాకతీయ జూనియర్ కళాశాలలోని గంగాక్యాంపస్‌లో ఆతిథ్య పరిశ్రమ దానిప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో వర్క్ షాప్‌ను సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. భారతదేశానికి వచ్చే పర్యాటకుల సంఖ్యకు హెూటల్ పరిశ్రమ ఒక కొలమానం అని, ఇది దేశాభివృద్ధిలో ఒక భాగమని అన్నారు. ఇది ఒక అద్భుతమైన సెషన్ అని, విద్యార్థులు కార్యాచరణ ఇంటరాక్టివ్ సెషన్లో భాగమైనందుకు థ్రిల్ అయ్యారని కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ అన్నారు. ఐస్ కార్వింగ్, బాటిల్ ఫ్లేరింగ్‌లలో రీజెన్సీ నిపుణుల బృందం మెళకువలను ప్రదర్శించింది. కార్యక్రమంలో రీజెన్సీ నిపుణుల బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బెడదను నివారించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కుక్కలు, కోతుల బెడద నివారించాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ ప్రజాపంథా నిజామాబాద్ నగర్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఇటీవల మన జిల్లాకు చెందిన బాలుడు వీధికుక్కల దాడిలో మరణించిన ఘటన తర్వాత కూడా ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందిలో పెద్దగా చలనం లేదన్నారు. నగరంలో కుక్కలు, కోతుల బెడద రోజురోజుకు తీవ్రమౌతున్నదన్నారు, బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులున్నాయన్నారు. కాలనీలలోని కుక్కలు వెంటబడుతున్నాయని, కోతులు ఇళ్ళల్లోకి చొరబడి, చిన్న పిల్లల్ని, పెద్దల్ని గాయపరుస్తున్నాయని అన్నారు. ఐనా మున్సిపల్ శాఖ నివారణ చర్యలు తీసుకోవడం లేదన్నారు. నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ కు ఫోన్ చేసినా స్పందన కరువైందన్నారు. కాల్ సెంటర్ నిరంతరం అందుబాటులో ఉండాలని, ఫిర్యాధులపై సత్వర చర్యలు తీసుకునేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి. కిరణ్, కే.గణేష్, టి.విటల్ తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు మనబడి పనుల పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మన బడి పనులను సర్పంచ్ సక్కారం అశోక్ సోమవారం సందర్శించి పరిశీలించారు. మరుగుదొడ్ల గదుల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గదులపై స్లాబ్ వేసే పనులను సర్పంచ్ అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యార్థం నిర్మిస్తున్న మరుగుదొడ్ల నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బైకాన్ ముకేష్, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్, శంకరగౌడ్, బిఆర్ఎస్ నెల్ల రమేష్, భాశెట్టి గంగాధర్ఎ, సక్కారం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్సీఎస్ఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ సహకార చక్కర కర్మాగారం (ఎన్సీఎస్ఎఫ్) సారంగాపూర్ రైతు వాటా దారుల సర్వసభ్య సమావేశం నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఎన్సీఎస్ఎఫ్ చెరుకు రైతుల ఆధ్వర్యంలో సోమవారం ఎన్సీఎస్ఎఫ్ చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు, వాటాదారులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నిర్వహించవలసిన సర్వసభ్య సమావేశం 14 సంవత్సరాలుగా నిర్వహించడం లేదని, ఈ సంవత్సరం అయినా సహకార చట్టం బైలా 28 ఏ ప్రకారం సర్వసభ్య సమావేశం జరుపుటకు వినతిపత్రం అందజేశామని చక్కెర ఫ్యాక్టరీ షేర్ హెూల్డర్స్ రైతులు సాయరెడ్డి, లక్ష్మ రెడ్డి తెలిపారు. నోటీసులు ఇచ్చిన నెలరోజులలోపు సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని, ఒకవేళ నిర్వహించకపోతే మార్చి 29 న సర్వసభ్య సమావేశం నిర్వహించుటకు చెరుకు రైతులు నిర్ణయించారన్నారు. సమావేశంలో అత్యధికంగా చెరుకు పండించే సరఫరా చేసే చెరుకు రైతులు, వాటాదారుల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఫ్యాక్టరీ షేర్ హెూల్డర్స్ తెలిపారు. కార్యక్రమంలో ఆకుల పాపయ్య, వెంకట్ రెడ్డి, బి.లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం పర్మినెంట్ ప్రాజెక్ట్ అయినటువంటి ఉచిత కంటి శిబిరంలో లయన్స్ భవనంలో సోమవారం 32 మంది కంటి వ్యాధిగ్రస్తులకు స్క్రీనింగ్ లయన్స్ డాక్టర్ భుజంగ్ రెడ్డి కంటి పరీక్షలు చేశారు. ముగ్గురికి మోతి బిందు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా.లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షులు లయన్ చెన్న రవికుమార్ మాట్లాడుతూ పట్టణం పరిసరాల ప్రజలు ఈ కంటి స్క్రీనింగ్, మోతి బిందు, లెన్స్ వేయడం లయన్స్ భవనంలో చేస్తారని, కాబట్టి ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ పద్మ నర్సయ్యలయన్ కృష్ణ పండిట్ ,రత్నం,పవన్ తదితరులు పాల్గొన్నారు.

గోవింద్‌పేట్‌లో అమ్మఒడి

నవతెలంగాణ-ఆర్మూర్

గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యురాలు మానస మాట్లాడుతూ గర్భిణీ అని తెలియగానే క్రమం తప్పకుండా ప్రతినెల వైద్య పరీక్షలు చేయించుకొని పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు పరీక్ష చేసుకోవాలన్నారు. ప్రసవ సమయంలో రక్తస్రావం అధికంగా ఉంటుంది కాబట్టి హిమగ్లోబిన్ అధికంగా ఉండేటట్లు క్యారెట్, బీట్రూట్, కోడిగుడ్డు పల్లి పట్టీలు బెల్లంతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు.